◆కథానిక

## రవీ!


నాకు వానపడ్డ తరువాత వీచే మట్టి వాసనల్ని ఆఘ్రాణించడం అంటే ఎంతో ఇష్టం! నువ్వు ఆ వాసనల్ని జొరబడనీయకుండా నా కిటికీ మూసేస్తావు. నా కిటికీ అద్దానికి అంటిన బురద మరకల్ని భయంగా చూస్తూ బంతి అడగడానికి కూడా జంకే ఎదురింటి పిల్లవాడిలో నా బాల్యం కనిపించినన్ను వెక్కిరిస్తుంది. అధునాతన బాత్‌రూంలో అంతకన్నా ఆధునికమైన బాత్‌టబ్‌లో పడుకుని జలకాలాడాలన్న కోరిక నాలో లేదు. కనీసం రేకులూడిన తలుపుకి చీర అడ్డం వేసుకుని అయినా సరే, ఎవరు తలుపులు బాది పిలవకుండా హాయిగా ఓ పది నిమిషాలు నా ఊహలలో నాకు స్నానించాలని ఆశగా వుంటుంది.

ఆదీ ఈ ఐదేళ్ళలో నాకు తీరని కోరికే అయింది. ఎర్రగా పండిన గోరింటాకు వేళ్ళతో, వెన్నెల్లో,నీ నోట్లో గోంగూర పచ్చడి ముద్దలు కలిపి, వెన్న పూస వంచి పెట్టాలని తపన పడ్డాను. వెన్నెలా వుంది, కోరికా వుంది. కానీ నీకు నాతో గడపడానికి ఏకాంతమే చిక్కలేదు!

'నాతి చరామి' అంటే నన్ను వదిలి పెట్టనని అర్థం అని పంతులుగారుచెప్పారు. ఆ నిమిషాన నీ మునివేళ్ళు నా మెడమీద అలవోకగా కదులుతూ వుంటే పరవశంతో తలమునకలయ్యాను. ఈరోజున నీతోబాటు నీ వాళ్ళు కూడా నన్ను నిమిషం కూడా ఏకాంతంగా వదిలిపెట్టరని తెలిసి వ్యథతో నలిగిపోతున్నాను.

అందరు ఆడపిల్లల్లాగానే కలలు కనడం నా తప్పా?

నువ్వు ఆఫీసునుండి వస్తావు. వస్తూనే నా జడలో మల్లెపూలు తురుముతుంటావు. నేను నిన్ను సున్నితంగా విడిపించుకుని లోపలికి వెళ్ళి టిఫిన్ ప్లేట్‌తో వస్తాను. నీకు నేను తినిపిస్తూ వుంటే నువ్వు చిలిపి పనులు చేస్తావు. నేను అలిగి బుంగమూతి పెడితే నువ్వు బతిమాలుకుని పరిహారంగా నన్ను షికారు తీసుకెళ్తావు. ఇద్దరం ఏకాంతంగా.. ఇలాగే సాగేవి నా ఊహలు! కానీ వాస్తవంలో ఏరోజూ ఇలా



బలభద్రపాత్రుని రమణి

# నన్ను అర్థం చేసుకో




జరగలేదు.

నువ్వు ఆఫీసు నుండి వస్తావు. వస్తూనే మీ నాన్నను, అమ్మను పలకరిస్తావు. ఆయన ఉబ్బసం, మీ అమ్మ ఆయాసం నిన్ను చూడగానే ఎక్కువవుతాయి. మనం సినిమాకి వెళ్ళాలంటే మీ చిన్న చెల్లెల్ని తీసుకెళ్ళాల్సిందే! లేకపోతేఆ అమ్మాయి ఏమైనా అనుకుంటుంది. రాత్రి పూట మనగదిలో చాలా సేపటి వరకు దీపం వెలుగుతూనే వుంటుంది. మన శృంగారాన్ని వీక్షించడానికి కాదు! నువ్వు జమా ఖర్చులు చూసుకోవడానికి. ఎప్పుడో ఏదో సాధించి నన్ను సుఖపెడతావని కాయితాలమీద అంకెలు వేసి చూపించి నన్ను మురిసిపోమంటావు.

అన్ని కోర్కెలకీ కళ్ళేలు వేసి ఎలాగో సర్దుకుపోతూ వుంటే నీలో అధికారం, నన్ను అణగదొక్కే గుణం ప్రబలిపోసాగాయి. మొదటిసారిగా నెలతప్పిన నేను ఆ వార్తను నీకు అందించడానికి మూడుమైళ్ళు నడిచి నీ ఆఫీసుకు వస్తే 'ఇప్పట్లో ఇంత తొందర పడడం అవసరం అంటావా? పుట్టేవాడ్ని ఎలా పెంచగలం?' అంటూ తియ్యని మాటలతో నన్ను అటునుండే అటే లేడీ డాక్టర్ దగ్గరకు తీసుకెళ్ళి అబార్షన్‌కి మందులు ఇప్పించావు. ఆ రహస్యాన్ని నా గుండెల్లోనే సమాధి చేయించావు! అయినా భరించాను. నువ్వేం చేసినా నా మంచికోసమే అనే గుడ్డి ప్రేమలో, కాసేపు ఏడ్చినా ఆ తర్వాత సహనంగా భరించాను. కానీ నువ్వేం చేశావు? నా కళ్ళముందే నీ పెద్ద చెల్లెలి శ్రీమంతం ఘనంగా జరిపించావు. నీ బావ ఏదో ఘనకార్యం సాధించినట్టుగా అతనికి స్కూటరు కొనిపెట్టావు. మనం రిక్షా కూడా ఎక్కలేని స్థితిలో వుండిపోయాం!

నీ తమ్ముడికి లెక్కలు చెప్పడానికి, నీ చెల్లెల్ని బజారుకు తీసుకు వెళ్ళడానికి, నీ తల్లిదండ్రులతో

ఆంధ్రజ్యోతి సచిత్ర వార పత్రిక తెలుగు కళాసమితి (న్యూజెర్సీ) రాజాలక్ష్మి ఫౌండేషన్ (మద్రాస్) సంయుక్తంగా నిర్వహించిన 1997 కథానికల పోటీలో కన్సోలేషన్ బహుమతి పొందిన కథ



మాట్లాడడానికి అన్నింటికీ నీకు తీరికుంది. కానీ నాతో హాయిగా డాబా మీద కూర్చుని కబుర్లు చెప్పడానికి నీకు ఓపిక లేదు. తలనెప్పిగా వుంటుంది. లేదా నిద్రొస్తుంది. నీ ఆఫీసర్ మేరేజ్‌డేకి గుర్తుపెట్టుకుని నాతో అభినందనలు చెప్పించే నీకు, మన మేరేజ్‌డేకి నాకు కనీసం చీర కొనాలని కూడా తెలీదు! అందరితో నవ్వుతూ, నవ్విస్తూ మాట్లాడతావు. నాతో తప్ప! నన్ను చూస్తే నీకు చిరాకు. అందుకే నన్ను విసుక్కుంటావు. నేను అలిగి అన్నం మానేస్తే నన్ను బతిమాలవు. ఆరోగ్యం గురించి లెక్చర్లిస్తావు. అదే నీ చెల్లెలయితే కలిపి తినిపించడానికి కూడా నువ్వు రెడీ! నీకు వాళ్ళే అంత ముఖ్యం అయినప్పుడు నన్నెందుకు పెళ్ళి చేసుకున్నావు. ఎవరితోనైనా చెప్పకుంటే అప్రతిష్ట! మనది ప్రేమవివాహం కూడాను! ఈ ప్రపంచంలో నువ్వు మనస్ఫూర్తిగా మాట్లాడగలిగేది నాతోనే అన్నావు. నేనే నీ ప్రాణం అన్నావు. అవన్నీ విని, నిజమని మురిసిపోయా. నీ చేత తాళి కట్టించుకుని నేను పొందినది ఏమిటీ? అనుభవిస్తున్నది ఏమిటి?

ఇప్పటికీ మీ అమ్మ చేతివంటే తింటావు. మీ తమ్ముడు, చెల్లెలూ పక్కనే లేకుండా సినీమాకి కూడా రావు. నా యీడుదే అయిన మీ పెద్దచెల్లెలు మనింటికొస్తే అపురూపాలు చేస్తావు. అప్పుడు నా మనస్సెంత మండుతుందో ఆలోచించావా? నేను ఉక్రోషంగా ఏదైనా అని ఏడిస్తే నన్ను నోరుముయ్యమంటావు. ఎవరి ముందు లేవని గొంతు నన్ను చూస్తే కంచుగంటలా మ్రోగుతుంది! ఛీ.. ఛీ! పుట్టింటికి వెళ్ళినా నాకు సుఖం లేదు! నీ సంపాదన గురించే తప్ప నీ అవసరాల గురించి ధ్యాస లేని నీ వాళ్ళు నాలా నీ కోసం ఎదురు చూసి, అన్నం పెట్టరు. నీకు జ్వరం వచ్చినా వాళ్ళతో చెప్పి నీ వాళ్ళని ఇబ్బంది పెట్టలేవు అని తెలిసి నేను పరుగున వచ్చేయడం నా బలహీనత! నాలోని ఎన్నో సరదాలనీ, సంతోషాలని చంపేసిన నువ్వు ఆరోజున గొప్పమేలే చేసావేమో! లేకపోతే ఈపాటికి మనకి ఐదేళ్ళ కొడుకుండేవాడు. చాలీ చాలని బట్టలతో, నిండీనిండని కడుపుతో నాతో బాటు నా ఏడుపుని పంచుకోవడానికి, రాత్రిళ్ళు నీవు నీవాళ్ళకోసం కరిగి వేకువఝామై తిరిగి వస్తూ వుంటే 'అమ్మా! నాన్నెప్పుడొస్తాడే!' అని అడగడానికి నాకో ప్రాణి తోడువుండేది. ఉండి ఏం బావుకునే వాడిని? నువ్వు చేసింది మంచిపనే! ఇలా నన్ను నేను ఊరడించుకుంటూ, ఎలాగో అలా కాలం గడుపుతూ వుంటే అమాంతంగా ఈ అవాంతరం మళ్ళీ వచ్చి పడింది. ఏదో ప్రధాని పదవి నన్ను వరించమన్నట్టుగా ఆ డాక్టరు ఈ దిక్కుమాలిన కబురు అందజేసింది. ఈసారి నువ్వు నన్ను తీసుకెళ్ళి అబార్షన్ చేయించే పని కూడా లేదు. అది నాకు కొత్తకాదు. అందుకే నేనే నా అంతట వెళుతున్నాను. ఈ సంగతి వృద్ధులైన మీ అమ్మానాన్నలకు చెప్పకండి! పాపం మనవళ్ళకోసం తపిస్తున్న వాళ్ళు తట్టుకోలేరు. ఈసారి కొద్దిగా ఆలస్యంగా తెలిసినందువల్ల కాస్త కష్టం అవుతుంది. అయినా ఫరవాలేదు లెండి. సీతాదేవి పద్నాలుగేళ్ళ వనవాసం, ఆపైన అగ్నిప్రవేశం భరించగా లేనిది, నేను ఆఫ్టాల్ ఈచిన్న ఆపరేషన్ భరించలేనా? ఎంతైనా సీతాసావిత్రులు పుట్టిన నేల మీద పుట్టిన ఆడదాన్ని కదా! కాఫీ కాచి ఫ్లాస్కులో పోసాను. త్రాగండి. రాత్రి వంట కూడా చేశాను. మీ అమ్మగార్ని కంగారు పడవద్దని చెప్పండి! నేను తొందరపడి ఈ పని వెంటనే చేయించుకోక పోతే, ఆతర్వాత పెద్ద ప్రాణానికే నష్టం అన్నారు. ఇంకో రెండు నెలల్లో మీ చిన్నచెల్లెలి పెళ్ళి కూడాను? నేను లేకపోతే ఎలా? బోలెడు పనులు అవీ.. ఎవరు చూస్తారు చెప్పండి? అందుకే మీరు ఆఫీసునుండి వచ్చేలోగానే ఈ నిర్ణయం తీసుకున్నాను. మిమ్మల్ని ఇంతకాలానికైనా అర్థం చేసుకున్నందుకు ఆనందిస్తున్నారు కదూ? నాకు తెలును! కర్పూరానికి హరించుకుపోవడంలోనే ఆనందం వుంది. కొవ్వొత్తికి కరగడంలోనే జీవితపరమార్థం వుంది! కానివ్వండి.

వుంటాను
మీ
సహధర్మచారిణి, సీత.

ఉత్తరం చదువుతున్న రవి చేతులు వణుకుతున్నాయి. ఉత్తరం పూర్తయ్యే టప్పటికీ అతని ఒళ్ళంతా చెమటతో తడిసి ముద్దయింది.

'ఏమైంది అన్నయ్యా? వదిన ఎక్కడికి వెళ్ళింది?' చెల్లెలు గాబరాగా అడిగింది.

రవి మాట్లాడకుండా చెప్పలు వేసుకుని బయటికి నడిచాడు.

'మళ్ళీ అంతలోనే ఎక్కడికిరా?' తల్లి అడిగింది. రవి సమాధానం చెప్పలేదు. బయటికి వచ్చి వెళ్తున్న ఆటోను ఆపి ఎక్కి కూర్చున్నాడు. సీతకి తెలిసిన లేడీ డాక్టర్ దగ్గరకే వెళ్ళుంటుందన్న ఊహతో సరాసరి అక్కడికే ఆటోను పోనిచ్చాడు.

రవి లోపలికి వెళ్ళేసరికి డాక్టర్ మాటలు వినిపిస్తున్నాయి.

'పెళ్ళయిన ఐదేళ్ళకి వచ్చిన అపురూపమైన గర్భం. అబార్షన్ చేయమని మొండి పట్టు పడ్తావేమిటీ? మీ ఆయనకి తెలుసా? లేక ఇది నీ స్వయం నిర్ణయమా?'

'ఆయనకి తెలుసు. తెలిసినా జరిగేది ఇదే! మాకు మా పిల్లల్ని పోషించే స్థోమత లేదు. ఆయనకు వచ్చే జీతం ఆయన వాళ్ళకే సరిపోదు. ఇంక మమ్మల్ని గురించి ఆలోచించడానికి టైమూ, డబ్బూ, రెండూ లేవు. అసలు నా గురించి ఆయనకు పట్టనే పట్టదు..' ఆపైన మాట్లాడలేక సీత వెక్కి వెక్కి ఏడ్చేసింది.

'రవి గురించేనా నువ్వు ఇలా మాట్లాడుతూ వుంట! నిన్ను ఎంతగానో ప్రేమించి కానీ కట్నం లేకుండా పెద్దలని ఎదిరించి పెళ్ళి చేసుకున్న రవి గురించేనా నువ్వు మాట్లాడుతున్నది!' డాక్టర్ కస్తూరి ఆశ్చర్యంగా అంది.

'ప్రేమించాను. అది ఒకప్పటి మాట. కానీ అది పెళ్ళితోనే ఆఖరయిపోయింది డాక్టర్. ఆ తర్వాత ఆ మాటకి అర్థం లేకుండా పోయింది. తనూ, తన కుటుంబం ఈరెండే అతనికి ముఖ్యం. తనను నమ్ముకుని వచ్చిన నా భావాలు, ఇష్టాలు అన్నీ అతనికి అనవసరం. ఎప్పుడూ నా సంతోషం కోసం ఏం చెయ్యలేదు. అతనంటే వున్న ప్రేమకొద్దీ నేను అన్ని బాధలు భరిస్తూ ఆ ఇంట్లో పడివున్నాను' సీత కళ్ళు రోషంతో ఎర్రబడ్డాయి. ముక్కుపుటాలు అదురుతూ వుండగా ఆవేశంగా వుంది. 'నాకీ బిడ్డవద్దు డాక్టర్! అబార్షన్ చేసెయ్యండి. ప్లీజ్!'

స్క్రీన్ వెనుకనుండి వారి మాటలు వింటున్న రవి ముందుకు వెళ్ళాడు. అతనిని అక్కడ చూసిన సీతా, డాక్టర్ మాట్లాడడానికి మాటలే రానట్టు చూస్తుండి పోయారు.

డాక్టర్ కూడబలుక్కుని 'రవీ! సీత అబార్షన్ చేయమంటోంది. ఎందుకూ?' అంది.

'చెప్తాను. ఓ పది నిమిషాలు సీతతో నన్ను మాట్లాడనీయండి' అన్నాడు రవి.

## దసరా చిట్టితల్లి



పాదాల వెంబడి బంగారు గజ్జెలు
సంగీతమును పాడు శాస్త్రమాయె
జాలి చూపుల కళ్ళు జాబిల్లి చందాన
కవితలల్ల మధుర కావ్యమాయె
నాజూకు నడకల నాల్గు అడుగులేయ
నవరసాలొలికించు నాట్యమాయె
పందెపు సమయాన పౌరుష జ్వాలలు
అంబరమున సూర్య బింబమాయె

ధరణిపైన లక్ష్మి దసరాకి గొర్రెలో
ఆవహించి మంచి త్రోవచూపి
మిద్దెలోకి పంపె మెడకు తాడును వేసి
చివరకేమి యగునో చిట్టితల్లి

విశ్వనాథ రామారావు

డాక్టర్ తలుపు దగ్గరగా వేసి బయటకు వెళ్ళిపోయింది.

'సీతా' పిలిచాడు రవి.

సీత అతని వైపు చూడలేదు. 'మీకు ఇష్టమేగా. టైం వృధా చెయ్యడం ఎందుకు? త్వరగా చేసెయ్యమను' అంది వస్తున్న దుఃఖాన్ని అతిప్రయత్నం మీద ఆపుకుంటున్నట్టుగా అతనికి తెలిసిపోయింది.

'అలాగే! కానీ ముందు ఈ ఉత్తరంలో వున్న ప్రశ్నలకు నన్ను జవాబు చెప్పకోనీ' ఉత్తరాన్ని ఆమె ముందు పెడుతూ అన్నాడు రవి.

ఆ ఉత్తరంవైపు చూడాగానే సీతకి ఉప్పెనలా దుఃఖం ముంచుకు వచ్చింది. 'ఏం చెప్తావు? నా ఆనందాలు, ఆశలు అన్నీ నేలమట్టం చేసి, నా కలల పుస్తకాన్ని చింపేసి, నా శృంగార సామ్రాజ్యాన్ని చిన్నాభిన్నం చేసి, నా మనస్సుని హత్యచేసి ఇంకా ఏం చెప్పాలనుకుంటున్నావు?' ఏడుస్తూ అడిగింది..

రవి స్టూల్ ఆమె మంచం దగ్గరగా జరుపుకుని కూర్చున్నాడు.

'నీ అభియోగాలన్నీ నిజమే! వాటిలో నిజం వుంది. ఒప్పుకుంటున్నాను. కానీ అవన్నీ నీ కోసమే చేశాను. అంటే నువ్వు నమ్మవు!' అన్నాడు.

'నా కోసమే?' సీత హేళనగా అడిగింది. 'నా కడుపులో బిడ్డని చంపడం నా కోసమా? నా ఎదుటే మీ వాళ్ళకోసం నువ్వు రకరకాల త్యాగాలు చెయ్యడం, వాళ్ళ కోర్కెలు తీర్చడం నా కోసమా?' ఆమె ఆవేశంగా అరుస్తూ వుంటే, రవి వారించాడు.

'పూర్తిగా విని మాట్లాడు. నీలా నాకు బోలెడు భాషా, భావుకత్వం రెండూ లేవు. నేను చాలా సామాన్యుడిని. నిన్ను మనస్ఫూర్తిగా ప్రేమించాను. మన పెళ్ళికి కట్నం అడ్డువడుతూ వుంటే, ఇంట్లో వాళ్ళని ఎదిరించి నిన్ను పెళ్ళి చేసుకున్నాను'.

'అంతవరకూ నీ ప్రేమని నేను ఒప్పుకుంటాను'.

'ఆతర్వాత నువ్వు అనుభవించిందంతా దాని తాలూకు పరిణామాలే!'

'అంటే?'

'కోడలు కట్నం డబ్బు తెస్తే కూతురు పెళ్ళికి చేసిన అప్పులు తీరిపోతాయని, కొడుకు చదువుకి అందుతుందని ఆశపడే అతిసాధారణమైన మన తత్వం కలవారు నా తల్లిదండ్రులు. నేను ఆ విషయంలో వారికి ఆశాభంగం చేశాను. కానీ ఆ నష్టం వాళ్ళకి రాకుండా చూడాల్సిన బాధ్యత ఆ నిమిషంలోనే చేపట్టాను. ప్రతిరోజూ ఆఫీసు నుంచి వస్తూనే నా తల్లిదండ్రుల్ని పలకరించడం ద్వారా వాళ్ళని సంతోషపెట్టగలిగాను కానీ వాళ్ళకి పెద్ద పెద్ద స్టార్ హాస్పిటల్స్‌లోవుంచి వైద్యం చేయించలేక పోయాను. అయినా నేను చేసే ఆ చిన్న చర్య వల్ల వాళ్ళు తృప్తి చెందారు. నా పెద్దచెల్లెలికి శ్రీమంతం చెయ్యడం, బావకి స్కూటరు కొనిపెట్టడం మన భవిష్యత్తు ఆనందంగా వుండడానికే. బావ దాన్ని పుట్టింటికి పంపేస్తే, ఎదురుగా పెళ్ళయి పుట్టిల్లు చేరిన ఆడబిడ్డని పెట్టుకుని నువ్వు ఏం సుఖపడే దానివి? నా చిన్నచెల్లెలి వెంట బజారుకు వెళ్లడం అన్నగా దాని సెక్యూరిటీ పట్ల వున్న భయం వల్ల. వయసు తొందరలో కాలు జారితే ఆ విపత్తు తట్టుకోవలసింది మనమే కాబట్టి. నా తమ్ముడికి టైం చేసుకుని లెక్కలు చెప్పడం, నా ఆర్థిక స్థోమత వాడికి ట్యూషన్ పెట్టడానికి అంగీకరించదు కాబట్టి! రాత్రిళ్ళు నేను మేలుకుని లెక్కలు వేసేది ఎంత తొందరగా ఈ అవరోధాలన్నీ దాటి నువ్వు కోరుకునే నీ కలల ప్రపంచంలోకి తీసుకెళ్ళగలనా అనే! నీకు అబార్షన్ చేయించింది కూడ ఈ ఆర్థికవత్తిడుల మధ్య కనీసం నీకు పండు కూడా కొనలేనేమో, నీకు ఏమైనా అవుతుందేమో, అన్న భయం వల్లే! నీ భావాలు,ఇష్టాలూ ఏనాడు పట్టించుకోలేదన్నావు. కానీ నీకు తెలీకుండా ఇంటి కోసం స్థలం కొన్నాను. నువ్వు కోరుకునే విధంగా చిన్న ఇల్లు కట్టుకోవడానికి లోన్ శాంక్షన్ అయింది. నెలనెల మనకి పుట్టబోయే వాడికోసం డబ్బు వేస్తూ వచ్చాను. వాడి చదువుకీ, భవిష్యత్తుకి ఢోకా లేకుండాపక్కా ఏర్పాట్లు చేశాను. ఆ చెల్లెలి పెళ్ళీ, నా తమ్ముడి చదువూ నాకున్న పెద్ద ఖర్చులు వాటి కోసం పొదుపుగా వుండడం తప్పలేదు. అందుకే నీతో షికార్లు, సినిమాలు, అవుటింగులు కుదరలేదు. ముందుముందు భవిష్యత్తంతా మనదే కదా అనుకున్నాను కానీ ఈలోగానే నువ్వు ఇంతత్వరపడి అభిప్రాయాలు ఏర్పరచుకుంటావను కోలేదు. ఛీఛీ! ఏం అన్నావు? మా అమ్మ చేతివంటే తింటావన్నావు కదూ? ఎందుకనుకున్నావు? కోరి పెళ్ళి చేసుకున్న ముద్దుల భార్య మీద ఆ బాధ్యత పడకూడదని! వెన్నెల్లో డాబామీద ఏకాంతం.. అవన్నీ వయసొచ్చిన చెల్లెళ్ళి ఇంట్లో పెట్టుకుని చేయడం మంచిదే నంటావా? నీ పెళ్ళికాక ముందు మీ అన్నయ్యా, వదినా సరసాలు నీకు ఇబ్బందిగా వుండేవని నాతో నువ్వు చెప్పావు. మర్చిపోయావా? ఏవండో మిఠాయో తెచ్చి దాని చేతిలో పెడితే అది మురిసిపోతుంది. రేపు పెళ్ళయి పరాయి ఇంటికి వెళ్ళిపోయినా పుట్టింటి గురించి ఏ ఫిర్యాదు వుండకుండా 'మా అన్నా వదిన చాలా మంచివాళ్ళు' అని చెప్పుకుంటుంది. ఆ పేరు నీకు తీసుకు రావాలనుకోవడం నీ తప్పా? నేనేం చేసిన అస్వార్థం కోసమే చేశాను సీతా! మన కోసం. కానీ పెద్ద ఆదర్శవంతుడిలా దానికి షుగర్ కోటింగ్ ఇచ్చాను. నీతో స్ట్రిక్ట్‌గా వున్నట్టు నటించి మన ఆర్థికస్థితి గురించి ఇంట్లో వాళ్ళకి అవగాహన ఏర్పరిచాను. 'వదినకి పెళ్ళి రోజుకి కూడా చీర కొనలేదు. నేను కారణం లేకుండా ఇవ్వడు డ్రెస్ అడిగితే ఏం బావుంటుంది' అనే ఆలోచన నా చెల్లెళ్లో, తమ్ముడిలో కలుగజేశాను. ఇవన్నీ ప్లాన్ చేసి చేసిన నేనుఒక తప్పు మాత్రం నీ పట్ల చేశాను' రవి ఆగాడు.

ఆశ్చర్యంగా వింటున్న సీత 'ఏమిటది?' అంది.

'అందరి దగ్గరా చూపిస్తూ వచ్చిన 'హిపోక్రసీ' నీ దగ్గర చూపకపోవడం! ఔను. అమ్మా నాన్నా, చెల్లెళ్లు, తమ్ముడూ అందరూ నా ఓరుపే, చిరు

## ఆ ఆకర్షణే స్త్రీత్వానికి నిదర్శనం

—టాబూ



'ప్రతి ఆడపిల్లలోనూ ఆకర్షక గుణం వుంటుంది. ఆ ఆకర్షక గుణమే ఆమె స్త్రీత్వానికి నిదర్శనం. ఆకర్షించడం, ఆకర్షింపబడడం ఒక సహజమైన ప్రకృతి ప్రక్రియ. ఆకర్షించడం రసాయన క్రియ. అదొక శాస్త్రీయంగా జరిగే ప్రాసెస్. కొన్ని వేల మందిని ప్రతిరోజూ మనం చూస్తుంటాం. వారిలో ఒకే ఒకవ్యక్తి మనకు నచ్చుతాడు. ఆకర్షింపబడతాడు. దానికారణం ఒక శరీరం, ఇంకో శరీరానికి ఆకర్షింపబడడమే. దీనినే మనం ప్రేమ అంటాం. ఒక పురుషుడే స్త్రీకి సమస్తమూ కాదు. సర్వస్వమూ కాదు' అని అంటోంది బాలీవుడ్ అందాల బాల టాబూ. గ్లామర్‌నటి స్థాయి నుంచి ఉత్తమ నటి స్థాయికి ఎదిగిన టాబూ ఎమోషన్స్‌లేని బాంధవ్యాలతో పెద్ద ప్రమాదం లేదు. కానీ ఒకప్పుడు మనకు సన్నిహితంగా వున్న వ్యక్తులు ఆ తర్వాత కాలంలో మనకు దూరమై పోయినప్పుడు, ఆ దూరం కారణంగా అవతలి వ్యక్తుల వల్ల మనకు కొంచెం ఇబ్బంది ఏర్పడుతుంది' అని చెప్తోంది టాబూ. ఈ రిలేషన్స్ నీతిబోధలు ఇవ్వడెందుకు తల్లీ అని జర్నలిస్టులు అడిగితే 'ఈ మధ్య నా అబ్జర్వేషన్ పెరిగింది లెండి' అని అంటూ నవ్వేసింది. ఎవర్ని అబ్జర్వ్ చేస్తోందో? ఎందుకు చేస్తోందో అతి త్వరలో తెలుస్తుందేమో! ఏమంటారు?

నవ్వే చూశారు. హిపోక్రెటికల్‌గా వాళ్ళ అవసరాల్ని కొన్నిసార్లు ప్రేమ నటిస్తూ, మంచిమాటలతో దాటించేశాను. కానీ నీ దగ్గరకి వచ్చే సరికి హిపోక్రసీ చూపించలేకపోయాను. నీకూ, నాకు తేడా లేదన్న నమ్మకంతో అలా చేశాను. అందుకే నువ్వు నామీద అలిగి అన్నం మానేస్తే బతిమాలకుండా ఆరోగ్యం గురించి హెచ్చరించాను. నీతో నాలో నిజంగా దాగివున్న ఫీలింగ్స్ అన్నీ బట్టబయలుగా బయటపెట్టాను. నా చిరాకు, కోపం, మనసులో మాటా అన్నీ నీ ఒక్కదాని దగ్గరే బయటపెట్టాను. దగ్గర వాళ్ళ దగ్గరే ఇలాంటి ఎమోషన్స్ చూపెట్టగలం అని నమ్మే వాళ్ళల్లో మొదటి వాడిని నేను! నీ దగ్గర కూడా నా భావాలకి తెరవేసి, ముఖం మీద రంగులు పులుపుకుని నాటకాలాడితే బావుండేదంటావా? ఇంక అప్పుడు నువ్వు నాకేం దగ్గరా? మన భవిష్యత్తుకి ఇప్పుడు భయం లేదు. మన ఇంట్లోకి మన చిన్నారి రావచ్చు అని సంతోషంగా ఎదురు చూస్తున్న తరుణంలో నువ్వు వాడిని ఈ లోకంలోకి రాకుండా చేసెయ్యాలని నాతో కూడా చెప్పకుండా వచ్చేశావు. ఇందులో నిన్ను తప్పుపట్టాల్సిందేమీ లేదు. హిపోక్రసీ లేకుండా నీ బాధంతా నువ్వు వెళ్లగక్కావు. నీ నిరసన నువ్వు చూపించావు. కొత్త పెళ్ళికూతుర్ని సరదాలు, ముచ్చట్లు తీరడానికి ఐదేళ్ళు ఓపిక పట్టమనడం అన్యాయమే! నిన్ను నేను అర్థం చేసుకోగలను!'

'రవీ! నేను మిమ్మల్ని ఇలా అర్థం చేసుకోలేక పోయాను' సీత కన్నీళ్ళతో అతని మెడని వాటేసుకుని, అతని గెడ్డం క్రింద తన ముఖం దాచేసుకుంటూ అంది.

'కోపం, ప్రేమ వచ్చినప్పుడు 'నువ్వు' అంటావుగా! మళ్ళీ మీరు అనడం ఎందుకు?' రవి నవ్వుతూ అన్నాడు.

సీత అతని కళ్ళల్లోకి చూడలేక తలదించుకుని 'ఇదంతా నాతో విపులంగా ఇన్నాళ్ళు చెప్పలేదెందుకు రవీ?' అంది.

'చెప్తే ఏం జరిగేది? పెద్ద త్యాగం చేసేస్తున్నామన్న ఫీలింగ్‌తో మా వాళ్ళని ఏమైనా అనే దానివి. వాళ్ళ దృష్టిలో చెడ్డదానివి అయ్యేదానివి. నాకు అది ఇష్టం లేదు. నీ గురించి నా వాళ్ళంతా సానుభూతే తప్ప చెడుగా అనే అస్కారం నేను రానివ్వలేదు'.

'ఒకవేళ.. ఒకవేళ నేను భరించలేక నిన్ను... ఆపైన ఆగి అతని వైపు చూసింది.

'ఊ.. వదిలేసి వెళ్ళిపోతే ఏం చేసే వాడివి? అంటావా?' నవ్వుతూ అడిగాడు.

సీత తల వంచుకుంది.

'పిచ్చి! నువ్వు నన్ను అర్థం చేసుకోలేక పోయావు కానీ నేను నిన్ను అర్థం చేసుకున్నాను. నేను ఆఫీసు నుండి రావడం రెండు నిమిషాలు ఆలస్యం అయితే నీ కళ్ళల్లో కనబడే ఆరాటం, నాకు ఒళ్ళు బడితే నీ గుండెల్లోంచి పొంగుకొచ్చే దిగులూ తెలిసిన నేను అలాంటి ఆలోచనలు చెయ్యగలనా? నేను నిన్ను మనస్ఫూర్తిగా ప్రేమించాను సీతా! ప్రేమించాను? నా గురించి నా కంటే నీ గురించే నాకు ఎక్కువగా తెలుసు! పద.. వాన వెలిసింది. తియ్యని మట్టివాసనల్ని ఆఘ్రాణిద్దాం. నీ బాల్యాన్ని, నా బాల్యాన్ని మనకు పుట్టే బుజ్జిగాడిలో మళ్ళీ ఓసారి నెమరు వేసుకుందాం!' రవి ఆమెని అలాగే పట్టుకుని లేవనెత్తుతూ అన్నాడు.

సీత అతనిని చుట్టుకుని సన్నగా వెక్కిళ్ళు పెడుతూ 'రవీ.. ఐ లవ్ యూ!' అంది.

'ఐ నో దట్!' రవి ఆమె తల నిమిరి చెప్పాడు.

ఆ ఇద్దరూ కలిసి బయటకి నడుస్తూ వుంటే చూసి చిన్నగా నవ్వుకుంది డాక్టర్ కస్తూరి.

రవి కూడా నవ్వుకున్నాడు. తన బాధ్యతలన్నీ నెరవేర్చడానికి ముందుగా తను వేసిన 'ప్రేమ' అనే సుగర్ కోటింగ్‌కు మురిసిపోయి ఆ మాత్ర చేదుని మరిచిపోయిన అమాయకపు భార్యను చూసి! ఏది ఏమైనా ఆ మందు మంచి ఫలితాన్నిచ్చింది. వారి సంసారం ఆరోగ్యవంతంగా కళకళలాడింది!

స్వార్థం..హిపోక్రసీ అంతర్వాహినిగా ప్రవహించని మానవ సంబంధాలుంటాయా?



## నా గురించి నేను

చిన్నప్పటి నుంచి పుస్తకాలంటే ఇష్టం కావడం వల్ల, ఆ పుస్తకాలే నన్ను రచయిత్రిని చేసాయి. విశ్వనాథ, శరత్ చంద్ర, చలం, యద్దనపూడి, యండమూరి తదితరు లిష్టం. డిసెంబర్ 93 నుంచీ రచనలు చేస్తున్నాను. కొన్నింటికి విశిష్ట బహుమతులొచ్చాయి. రేడియో, టీ.వీ కి రచనలు చేసాను. రెండు నవలలు కన్నడంలోకి అనువదింపబడ్డాయి. ప్రజల్లో పఠనాశక్తి మళ్ళీ ఊపందుకుని పుస్తకాలు కొని చదివే మంచి రోజులు రావాలని కోరిక

బలభద్ర పాత్రుని రమణి.

## యుగాంతం

యుగాంతం కావచ్చు
ఏక్షణమైనా
విధ్వంసం కావచ్చు
ప్రపంచం!
నశించవచ్చు
జీవరాశి అంతా
విచ్ఛిన్నం కావచ్చు
పురోగమనమంతా!
అదెపుడు?
మనసు కల్మషమై,
మనసుతో బూచి
దో బూచిలాడినపుడు
వికలమై, విశానమై
మనసు
అణుబాంబులు మీటలు నొక్కవచ్చు!
తెరదించవచ్చు
ఈయుగానికి
పలకవచ్చు ఆహ్వానం
ప్రళయానికి
చెప్పవచ్చు
స్వాగతం యుగాంతానికి

— ఏడిద గోపాలరావు —